క్లుప్తంగా

'వాసవీ వనిత' సేవలు అభినందనీయం



షెడ్‌ను ప్రారంభించిన జిల్లా గవర్నర్ మణికంఠకుమార్

సామర్లకోట: స్థానిక వాసవీ వనితా క్లబ్ సేవలు అభినందనీయమని వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ కాకి మణికంఠ కుమార్ అన్నారు. గవర్నర్ పర్యటనలో భాగంగా ఆదివారం రాత్రి స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో రోగులు వేచి ఉండటానికి నిర్మించిన షెడ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాట్టారు. పేదలకు దుప్పట్లు, గర్భిణులకు బియ్యం, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. విద్యా సేవల్లో భాగంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అలాగే ఆలంబన పెన్షన్ స్కీమ్‌లో భాగంగా ఐదు గురు విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.200 చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా క్లబ్ ఇన్‌చార్జిలు కటకం రత్నకుమారి, కటకం హైమావతి, జోన్ చైర్మన్‌లు కె.భాను, జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్ గుడిమెట్ల సమత, సామర్లకోట క్లబ్ అధ్యక్షురాలు కటకం పద్మరత్నం, కార్యదర్శి గుడిమెట్ల సౌమ్య, కోశాధికారి మట్లపల్లి సునీత ఆర్యవైశ్య సంఘ అధ్యక్షురాలు కాపు గంటి పైడిరత్నం, జిల్లా కేబినేట్ కార్యదర్శి డాక్టరు అనిల్‌కుమార్, కోశాధికారి టీవీఎస్ఎస్ఎం స్వామి, రీజినల్ చైర్మన్ కేదారిశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శాస్త్రీయ ఆచరణ అవసరం



సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

పెద్దాపురం: విద్యార్థి దశ నుంచే ప్రతి విద్యార్థి శాస్త్రీయ ఆచరణాత్మకత ఎంతో అవసరమని సైన్స్ సెంటర్ నిర్వాహకుడు బుద్దా శ్రీనివాస్ అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ఏపీటీ సైన్స్ సెంటర్ ఏర్పాటులో భాగంగా భౌతిక, రసాయనిక శాస్త్ర ప్రయోగాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్దా శ్రీనివాస్ మాట్లాడుతూ విన్న, చదివిన దానికంటే ప్రయోగాత్మక, ఆచరణీయ అంశాలపై విద్యార్థులు శ్రద్ధ వహించాలన్నారు. పాఠ్యాంశాల్లో చదివిన అంశాలను ప్రయోగం చేయడం ద్వారా విద్యార్థులు మరింత మేధస్సును సాధించవచ్చన్నారు. అనంతరం పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రేవతి సైన్స్ ఫౌండేషన్ కృష్ణసాయి, సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మంటలు చెలరేగి స్కూటీ దగ్ధం



మంటల్లో దగ్ధమవుతున్న వాహనం

పిఠాపురం: భార్యాభర్తలు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనంలో మంటలు చెలరేగిన సంఘటన ఆదివారం సాయంత్రం గొల్లప్రోలు సమీపంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో స్కూటీ పూర్తిగా దగ్ధం కాగా, భార్యాభర్తలు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గొల్లప్రోలుకు చెందిన దంపతులు సత్యనారాయణ, వెంకటలక్ష్మి స్కూటీపై పిఠాపురానికి బయలుదేరారు. గొల్లప్రోలు శివారు చేరుకునేసరికి స్కూటీ నుంచి పొగలు వచ్చాయి. అపాయాన్ని పసిగట్టిన సత్యనారాయణ వెంటనే వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి, భార్యను కిందకు దించేశారు. క్షణాల్లో మంటలు చెలరేగి, వాహనం దగ్ధమైంది. పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

- అనంతరం యథావిధిగా స్పందన
- కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు



కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. ప్రజలు నగర పాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 0884-2357800కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునని, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. 10:30 నుంచి స్పందన యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఖరీఫ్ కోతలు వడివడిగా..

- ఆశించిన స్థాయిలో దిగుబడులు
- ఎండల తీవ్రతతో తెగుళ్లు దూరం
- ఎకరానికి 35 నుంచి 40 బస్తాల దిగుబడి



యంత్రంతో వరి కోతలు ప్రారంభించిన రైతులు



వేట్లపాలెం రైస్ మిల్లుకు చేరుకున్న ధాన్యం లోడు

సామర్లకోట: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు మంచి దిగుబడి సాధించే అవకాశం కనిపిస్తోంది. వరి నాట్లు వేసిన సమయంలో రైతులకు కావలసిన స్థాయిలో వర్షాలు కురిసాయి. వరి పంట తయారయ్యే వరకు నీటి ఎద్దడి లేకుండా ప్రతి ఎకరాకు సక్రమంగా నీరు అందింది. దీనికి తోడు వరి చేలు పంటపై ఉన్న సమయంలో వర్షాలు పడకపోవడంతో రైతులకు మేలు జరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఖరీఫ్ పంట సీజన్‌లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో తెగుళ్ల బెడద తగ్గిందని రైతులు చెప్తున్నారు.

వరి కోతలు ప్రారంభం

మండల పరిధిలో 22,250 ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేశారు. ఎంటీయూ 1318 రకం 6,850 ఎకరాల్లోను, ఎంటీయూ 7027 రకం 14,650 ఎకరాల్లోను, ఎంటీయూ 1281 రకం 750 ఎకరాల్లోను వరి సాగు చేస్తున్నారు. బొండాలను విత్తనాల కోసం పండిస్తున్నారు. వరి పంట కోతకు రావడంతో దీపావళి ముందుగానే అనేక మంది రైతులు కోతలు ప్రారంభించారు. గత ఖరీఫ్ సీజన్‌లో ఎకరానికి 33 బస్తాలు మాత్రమే సరాసరి దిగుబడి వచ్చింది. మండల పరిధిలో వేట్లపాలెం, జి.మేడపాడు, పీబీ దేవం గ్రామాల పరిధిలో రైతులు వరి కోతలు ప్రారంభించారు.

వరి కోత యంత్రాలకే ప్రాధాన్యం..

పంట చేతికి అందే పరిస్థితులు ఏర్పడటంతో రైతులు వరి కోత యంత్రాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. మనుషులతో వరి కోతల వల్ల ఎకరానికి అదనంగా రూ.ఐదు వేల వరకు అదనపు పెట్టుబడి అవుతుందని రైతులు చెప్తున్నారు. వరి కోత యంత్రాలతో వెంటనే ధాన్యం చేతికి వస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మనుషులతో కోతలు చేస్తే వరి పనలు, కుప్పలు వేయడం, సూర్పిడి చేయడం వంటి పనులు చేయాల్సి ఉంటుందని, ఏ సమయంలో వర్షాలు వచ్చిన ధాన్యం తడిసిపాయే ప్రమాదం ఉంటుందని రైతులు చెప్తున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో యంత్రాల ద్వారా కోతలు కోసి ఒక రోజు ఆరబెడితే ధాన్యం తేమ శాతం పూర్తిగా తగ్గిపోతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. వరి కోత యంత్రం ద్వారా గంట 15 నిమిషాలకు ఒక ఎకరం కోత జరుగుతుంది. మండల పరిధిలో రైతుల అవసరాలను తీర్చడానికి కేవలం 25 వరి కోత యంత్రాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీపావళి తరువాత రైతులు అందరూ ఒకేసారి కోతలు ప్రారంభించే అవకాశం ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులు దీపావళికి ముందుగానే కొందరు కోతలు ప్రారంభిస్తున్నారు. పాడి రైతులు గడ్డి కోసం కూలీలతో కోతలు కోయిస్తున్నారు.

రైతులే వేలి ముద్రలు వేయాలనే నిబంధన సరికాదు...



ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించే సమయంలో భూమి కలిగిన రైతు వేలి ముద్ర వేయాలనే నిబంధన సరికాదు. రైతులు ఇతర ప్రాంతాల్లో ఉన్న సమయంలో ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. సివిల్ సప్లయ్ అధికారులు నియమించిన సాంకేతిక సిబ్బందిని ఇప్పటి వరకు ఆర్బీకేలకు తరలించలేదు. వారి తీరుతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. యంత్రాలతోనే వరి కోతలు సులభంగా అవుతాయి. యంత్రాలతో కోతల వల్ల ఎకరానికి రూ.ఆరు వేల వరకు ఆదా అవుతుంది. ఎకరానికి 40 బస్తాలు దిగుబడి వస్తుంది. అగ్గి తెగులుతో కొంత మేర నష్టం జరిగింది.

– మోరంపూడి రమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, జి.మేడపాడు

ఐదు వరి కోత యంత్రాలు...



గత సీజన్‌లో వ్యవసాయశాఖ ద్వారా ఐదు వరికోత యంత్రాలను 40 శాతం సబ్సిడీపై రైతులకు అందజేయడం జరిగింది. వరి కోతలు ప్రారంభం కావడంతో ఆర్బీకేల్లో ధాన్యం కొనుగోలుకు సిద్ధం చేశాం. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎకరానికి 35 నుంచి 40 బస్తాలు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. రైతుల పొలాల నుంచి ధాన్యం మిల్లులకు ధాన్యం రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ పరికరాలను అమర్చడం జరిగింది. దీని కారణంగా ధాన్యం రవాణా వాహనాల సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుంది.

– ఐ.సత్య, మండల వ్యవసాయాధికారి, సామర్లకోట

ఖోఖోలో 'కోట' విద్యార్థుల ప్రతిభ



సీహెచ్ కృష్ణ



కె.పద్మ శ్రీవల్లి

సామర్లకోట: కాకినాడ డీఎస్ఏ మైదానంలో శనివారం సాయంత్రం జరిగిన ఉమ్మడి జిల్లా ఖోఖో స్కూల్ గేమ్స్‌లో సామర్లకోట ప్రతిభా విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 9వ తరగతి విద్యార్థి సీహెచ్ కృష్ణ, 8వ తరగతి విద్యార్థిని కె.పద్మ శ్రీవల్లి జిల్లా స్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల కరస్పాండెంట్ ఎస్‌వీవీ ప్రకాష్ తెలిపారు. ఆదివారం ఆయన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై న విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ టి.సునీత, వైస్ ప్రిన్సిపాల్ పి.గౌరి విద్యార్థులను అభినందించారు.

యువతి అదృశ్యం

కాకినాడ రూరల్: మండలంలోని తూరంగి అల్లూరు సీతారామరాజు డ్రైవర్స్ కాలనీకి చెందిన యువతి అదృశ్యంపై ఇంద్రపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంటర్మీడియట్ వరకు చదివిన ఆమె ఈనెల 27వ తేదీ రాత్రి నుంచి కనిపించడం లేదని తండ్రి సూరిబాబు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై లక్ష్మణ స్వామి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీకేఎస్‌ను పటిష్ట పరచాలి



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణమూర్తి

ప్రత్తిపాడు: భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్)ను జిల్లాలో గ్రామ స్థాయి నుంచి పటిష్టపరచాలని సంఘ కాకినాడ జిల్లా అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి కోరారు. ప్రత్తిపాడు మునసబు గారి రామాలయంలో ఆదివారం సాయంత్రం బీకేఎస్ జిల్లా ప్రతినిధుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ యువతను సంఘంలోకి తీసుకురావాలన్నారు. బీకేఎస్ సభ్యత్వాన్ని పెంచాలని సూచించారు. వ్యవసాయాధారిత వృత్తులు చేపట్టిన మహిళలు కూడా సంఘంలో సభ్యులుగా చేరవచ్చని వక్తలు చెప్పారు. సమావేశంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి కౌలూరి పతిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాసంశెట్టి రాజా, వేలంక మాజీ సర్పంచ్ నీలగిరి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాదగయలో గ్రహణ పూజలు



కుక్కుటేశ్వరస్వామికి చేస్తున్న రుద్రాభిషేకం



పాదగయ క్షేత్రంలో గ్రహణ జపాలు నిర్వహిస్తున్న బ్రాహ్మణులు

గ్రహణం సందర్భంగా సంప్రోక్షణ, అభిషేకాలు

పిఠాపురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పాదగయలో చంద్ర గ్రహణం సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. గ్రహణం ప్రారంభమైనప్పటి నుంచి ఆలయ ద్వారాలను తెరిచే ఉంచిన అర్చకులు.. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రహణానంతరం సంప్రోక్షణ చేసి, స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. గ్రహణం సందర్భంగా దేవాలయాల మూసివేత సంప్రదాయమైనప్పటికీ, పాదగయలో మాత్రం ఆలయాన్ని తెరిచి ఉంచి.. గ్రహణ సమయంలో స్వామివారికి అభిషేకాలు చేయడం పూర్వం నుంచి ఆచారంగా వస్తోంది. శ్రీకాళహస్తి, పాదగయ క్షేత్రాల్లో మాత్రమే ఆలయాన్ని తెరిచిఉంచే ఆచారం కొనసాగుతోంది. ఇక్కడి స్వామి వారు కుక్కుటం(కోడి) ఆకారంలో ఉండడంతో పాటు గయాసురినికి మోక్షం ప్రసాదించినందున.. గ్రహణ సమయాల్లో స్వామివారి ఆలయాన్ని తెరిచి ఉంచుతారని అర్చకులు తెలిపారు. గ్రహణం సందర్భంగా పాదగయ క్షేత్రంలో పండితులు, బ్రాహ్మణులు గ్రహణ జపాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గ్రహణానంతరం భక్తులు పుష్కరిణిలో గ్రహణ స్నానాలు ఆచరించారు.

ప్రజా సేవల్లో లయన్స్ ముందంజ

జిల్లా గవర్నర్ సూర్యనారాయణ



లయన్స్ క్లబ్ కేబినేట్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గవర్నర్ సూర్యనారాయణ

సామర్లకోట: పేదలకు సేవలందించడంలో లయన్స్ క్లబ్ ముందంజలో ఉన్నదని క్లబ్ జిల్లా గవర్నర్ వెలూరి సూర్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక రైతు భవనంలో నిర్వహించిన లయన్స్ జిల్లా కేబినేట్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్లబ్‌ల సంఖ్య పెంచాల్సి ఉందని, పేదలకు సేవ చేయాలనే ఆలోచన ఉన్న వారిని సభ్యులుగా చేర్చుకోవాలని సూచించారు. కొత్తగా చేరిన సభ్యులకు లయన్స్ క్లబ్ నిబంధనలపై శిక్షణ ఇవ్వవలసి ఉంటుందని చెప్పారు. కేబినేట్ సమావేశాలల్లో సభ్యులు ఆయా అంశాలపై ప్రశ్నించే ముందు చైర్మన్ అనుమతి పొందాలని తెలిపారు. జిల్లా క్లబ్‌కు 19 క్లబ్‌లు బకాయిలు చెల్లించవలసి ఉన్నదని, అంతర్జాతీయ క్లబ్ 8 క్లబ్‌లు బకాయిలను సకాలంలో చెల్లించి జిల్లా క్లబ్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. నవంబరు 20–21 తేదిలల్లో జాతీయ స్థాయి కేబినేట్ సమావేశాలు జరుగుతాయని ఆయన తెలిపారు. క్లబ్ మొదటి గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్ అధ్యక్షత వహించగా రెండవ గవర్నర్ వి.కోటేశ్వరరావు పాల్గొని క్లబ్ సేవలను వివ రించారు. జిల్లా కేబినేట్ నివేదికను జి.వెంకటేశ్వరరావు అందజేశారు. కేబినేట్ సభ్యులు సీహెచ్ బాపిరాజు, కె.ఉమాదేవి, కొల్లూరి గోపాలకృష్ణ, పి.కామేశ్వరీదేవి, సీహెచ్ శ్రీనివాసు, పి.ఉమా మహేశ్వరరావు కేబినేట్‌లో పలు విషయాలను చర్చించారు. సామర్లకోట క్లబ్ అధ్యక్షుడు కాను బోయిన విజయకృష్ణ, కార్యదర్శి ఎస్ఆర్ ప్రసాద్, కోశాధికారి బడుగు బాబి, జిల్లా చైర్మన్ చిత్తూలూరి వీర్రాజు, రీజనల్ చైర్మన్ చిత్తూలూరి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్రహణ శాంతి పూజలు

బోట్‌క్లబ్: చంద్రగ్రహణం సందర్భంగా స్థానిక గొడారిగుంట జర్నలిస్ట్ కాలనీలో ఉన్న శ్రీరామ సమేత సత్యదేవ ప్రాంగణంలో మధ్వ పురోహితుడు యాతగిరి మధ్వేష్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రహణశాంతి పూజలు నిర్వహించారు. పలువురు మధ్వ గృహస్తుల తోపాటు భక్తులు కూడా ఈ పూజల్లో పాల్గొన్నారు. మండపారాధనతో పాటు శాంతి హోమాన్ని జరిపించారు. యాతగిరి మధ్వేష్ మాట్లాడుతూ మందిరంలో చంద్రగ్రహణ దోష నివారణ పూజలు విజయవంతంగా నిర్వహించామన్నారు.



ఆవులను రక్షించే క్రమంలో..



బయటకు తీస్తూ..



మరో ఆవును బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఎన్ని ఆవస్థలో..

బోట్‌క్లబ్: స్థానిక డీఎస్పీ కార్యాలయం పక్కన ఉన్న కాలువలో ఆదివారం సాయంత్రం రెండు ఆవులు దిగి బయటకు వచ్చేందుకు అనేక అవస్థలు పడ్డాయి. వాటి అవస్థలు చూసిన స్థానికులు వాటిని పైకి తీసుకువచ్చేందుకు అనేక విధాలుగా ప్రయత్నించారు. ఎంతో కష్టపడి ఒక ఆవును బయటకు తీసుకురాగలిగారు. మరో ఆవును బయటకు తీసుకొని రావడం వారి వల్ల కాలేదు. దీంతో కాకినాడ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారి వచ్చి దానిని కూడా బయటకు లాగారు. దీంతో ఆవులను బయటకు తీసిన ప్రజలను, అగ్నిమాపక సిబ్బందిని స్థానికులు అభినందించారు.

నవంబరు 4న భారీగా కోటి బిల్వార్చన



వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

తుని/తుని రూరల్: తుని మండలం వి.కొత్తూరు శివారు 16వ నంబరు జాతీయ రహదారిని ఆనుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న ఆకుల వీర్రాజు స్థలంలో నవంబరు నాలుగో తేదీన కోటి బిల్వార్చనకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం తుని కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో నిర్వాహకులు తుని, పాయకరావుపేట విలేకర్లతో మాట్లాడారు. తుని, పాయకరావుపేట పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప దీక్షాపరులు సుమారు 15 వేల మందితో కోటి బిల్వార్చన, పడిపూజ జరపనున్నట్టు వివరించారు. రాష్ట్రం నలుమూల నుంచి సేకరించిన బిల్వ పత్రాలను ఆరు లారీలతో వేదిక వద్దకు తరలించనున్నట్టు తెలిపారు. ఒకేసారి వేలాది మంది దీక్షాపరులతో స్వామివారికి సామూహిక హారతులిచ్చేలా ఏర్పాట్లు చేశామన్నారు. కాకినాడకు చెందిన వేలు గురుస్వామి, నాట్యాచార్య డాక్టర్ కృష్ణమోహన్ పర్యవేక్షణలో ఆ రోజు సాయంత్రం ఐదు నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. సంప్రదాయబద్ధంగా కోటి బిల్వార్చన, పడిపూజ నిర్వహించేందుకు శబరిమల ఆలయ ప్రధానార్చకులు, పందళరాజ వంశీకులు, 70 ఏళ్లుగా మకర సంక్రాంతి రోజున స్వామివారి తిరువాభరణాలను ఆలయానికి తీసుకెళ్తున్న పిళ్ళై, మరో 40 మంది కేరళ చండై వాద్యకారులు హాజరవుతున్నట్టు వివరించారు. నిర్వాహక ప్రతినిధులు చంటిస్వామి, దాసరి బాబ్జి, తటవర్తి సూరిపండు, పోతుల రమేష్ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీలో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కిర్లంపూడి: నిర్లక్ష్యంగా కాల్చిపారేసిన సిగరెట్ వల్ల నిప్పంటుకుని ఇటుక బట్టీలో కొబ్బరి పీచు దగ్ధమైంది. జగ్గంపేట ఫైర్ ఆఫీసర్ లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. కిర్లంపూడి మండలం తామరాడలో కలవలపల్లి సత్తిబాబుకు ఇటుక బట్టీ ఉంది. ఇటుకలను కాల్చడానికి సిద్ధంగా ఉంచిన కొబ్బరి పీచుకు ఆదివారం నిప్పంటుకుని, మంటలు ఎగసిపడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని, మంటలను అదుపు చేశారు. సుమారు రూ.50 వేల విలువైన కొబ్బరిపీచు దగ్ధమైంది.

ఉపాధ్యాయులకు గురుస్పందన పురస్కారాలు

కంబాలచెరువు: ఏలూరులో ఆదివారం జరిగిన గురుస్పందన కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. ఆ వివరాలను జిల్లా స్పందన ఈదా ఇంటర్ నేషనల్ ఫౌండేషన్ అధ్యక్షుడు కె.సతీష్ బాబు తెలిపారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జి, ఏలూరు జిల్లా డీఈవో శ్యామ్ సుందర్ చేతుల మీదుగా పురస్కారాలు ప్రదానం చేశారన్నారు. జిల్లాలోని వెదుళ్లపల్లి పాఠశాలకు చెందిన కె.ఝాన్సీ, హుకుంపేటకు చెందిన జి.జ్యోతి, సీతానగరానికి చెందిన కె.నాగేశ్వరరావు, రాజమహేంద్రవరానికి చెందిన ఐ.రాజ్ కుమార్, కడియానికి చెందిన ప్రేమ్ చంద్, సువర్ణ పురస్కారాలు అందుకున్నారన్నారు. ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంస్థ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, సమాజంలో గురువులపై తమకున్న గౌరవ భావాన్ని చాటి చెప్పారన్నారు.

విద్యార్థులకు వితరణ



విద్యార్థికి షూ స్వయంగా తొడుగుతున్న అమెరికా వాసి ఆండ్రో మెకడోనెల్

కాకినాడ రూరల్: పడాల చారిటబుల్ ట్రస్ట్ తన వారధి ప్రాజెక్టులో భాగంగా దత్తత తీసుకున్న తల్లి గాని, తండ్రి గాని లేని పిల్లలకు విదేశీయుల సహకారంతో ఆదివారం దుస్తులు, షూలు, శానిటరీ ప్యాడ్‌లను పంపిణీ చేశారు. రాయుడుపాలెం వద్ద పరమేశ్వరి ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులకు రూ.8 లక్షల విలువైన సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమెరికాకు చెందిన నాలుగు కంపెనీలు, స్వచ్ఛంద సంస్థలు, ఎస్ఆర్‌ఐ అపర్ణ, పడాల చారిటబుల్ ట్రస్ట్ సిబ్బంది రాజు పాల్గొన్నారు.

తలుపులమ్మ లోవలో భక్తుల రద్దీ



తలుపులమ్మ అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

రూ.4.38 లక్షల ఆదాయం

తుని రూరల్: లోవ దేవస్థానంలో కొలువై ఉన్న తలుపులమ్మ అమ్మవారి దర్శనాలకు భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన పదివేల మంది భక్తులు అమ్మవారిని క్యూ ద్వారా దర్శించుకున్నట్టు ఆలయ కార్యనిర్వాహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల ద్వారా రూ.1,10,580, పూజా టికెట్లకు రూ.1,10,870, కేశఖండన శాలకు రూ.10,080, వాహన పూజలకు రూ.8,930, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెల ద్వారా రూ.67,262, విరాళాల రూపేణా రూ.1,30,292లు మొత్తం రూ.4,38,014 ఆదాయం సమకూరినట్టు ఈఓ తెలిపారు.

గడ్డిమందు తాగి ఆత్మహత్య

రాజానగరం: కొండగుంటూరుకు చెందిన పిట్టా అప్పన్న (67) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొనఊపిరితో ఉన్న అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై సురేష్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. తాగుడుకు బానిసై ఇల్లు, ఒళ్లు గుల్ల చేస్తున్నావంటూ కుటుంబ సభ్యులు కోప్పడటంతో మనస్తాపానికి గురైన అప్పన్న.. మద్యంలో గడ్డి మందును కలుపుకొని శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

మహిళ ఆత్మహత్య

అప్పల బాధతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. కొండగుంటూరులో ఈ సంఘటన జరిగింది ఎస్సై సురేష్ కథనం ప్రకారం.. పేరూరి లక్ష్మి (45) ఇరుగు పొరుగు వారి వద్ద రూ.80 వేల అప్పు చేసింది. వాటిని తీర్చకపోవడంతో అప్పు ఇచ్చిన వారంతా ఒత్తిడి చేశారు. అప్పులు తీర్చే అవకాశం లేక ఈ నెల 7న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది.

కెరటాలతో కేరింత..



ఉప్పాడ బీచ్‌లో పర్యాటకుల సందడి

కొత్తపల్లి: ఉప్పాడ సాగర తీరం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. చిన్నా పెద్దా అంతా కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. కొత్తపల్లితో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి వచ్చారు. తుని సమీపంలో తలుపులమ్మతల్లి లోవ అమ్మవారి దర్శనానికి వెళ్లిన భక్తులు, తిరుగు ప్రయాణంలో ఇక్కడి తీరానికి చేరుకున్నారు. పెద్దలు, పిల్లలు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. పర్యాటకుల రాకతో వాహనాల సంఖ్య అధికంగా ఉండడం వల్ల కాకినాడ–ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బెంచీలు, తాగునీరు అందుబాటులో లేకపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.